క్లుప్తంగా

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అదనపు కట్నం కోసం కోడలిని వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ కుమ్మరి వీధికి చెందిన ఓసెట్టి జీవనిని 2013లో విశాఖపట్నానికి చెందిన త్రినాథ్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నం, ఇతర లాంఛనాలు భారీగానే ఇచ్చారు. వివాహ సమయంలో త్రినాథ్ కోర్టులో ఉద్యోగం చేస్తుంటాడని చెప్పారు. వివాహం తర్వాత త్రినాథ్ పనికి వెళ్లకుండా మద్యం సేవించి భార్యను వేధింపులకు గురి చేసేవాడు. దీనికి తోడు త్రినాథ్ తల్లి ఎర్రమ్మ వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి వచ్చేసింది. భర్త, అత్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లి, వేమవరానికి చెందిన ఉప్పతల మాణిక్యం, నాగరాజులు భార్యభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. నాగరాజు శ్లాబులు వేసే పని చేస్తుంటాడు. ఈ నెల 13న పనికి వెళ్తున్నట్లు చెప్పిన నాగరాజు బయటకు వెళ్లాడు. ఆ రోజు నుంచి నాగరాజు జాడ లేకపోవడంతో ఆందోళన చెందిన మాణిక్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జనార్దనరావు సేవలు చిరస్మరణీయం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణలోనూ పోతినేని జనార్దనరావు చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ చెప్పారు. ఇటీవల వృద్ధాప్యంతో మరణించిన జనార్దనరావు సంస్మరణ సభ ఆదివారం ప్రజాశక్తి నగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయం ఆవరణలో జరిగింది. రైతు సంఘం నాయకుడు ఆజాద్, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అజయ్‌కుమార్, కార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వాణి పత్రిక సంపాదకుడిగా ఉపాధ్యాయులకు విలువైన సమాచారాన్ని అందించారన్నారు. ఎం.అప్పారావు, సుబ్బారాయుడు, రాజారావు, ఇమ్మానుయేల్, మస్తాన్‌రావు, ఎం.శ్రీనివాస్ పాల్గొని జనార్దనరావు చేసిన సేవలను కొనియాడారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

విజయవాడ నగరంలోని రాజీవ్ గాంధీ పార్క్ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. ఉద్యోగ బాధ్యతలతో బిజీబిజీగా గడిపే నగర వాసులు వారాంతంలో కుటుంబ సభ్యులతో పార్క్‌కు తరలివచ్చి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









రహదారులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం బైపాస్‌రోడ్డులో సోమవారం ప్రభుత్వ ఇఫ్తార్ విందు సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని రహదారులన్నీ ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన ఆయా ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వారధి దగ్గర నుంచి విద్యాధరపురం బైపాస్ రోడ్డు వరకు రోడ్ల ఏర్పాట్ల పురోగతిని పరిశీలించి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా గ్రీనరీని ఏర్పాటు చేయాలని, ఇఫ్తార్ విందు జరిగే స్టేడియం చుట్టూ పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని, ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లను, డ్రెయిన్లను శుభ్రంగా ఉంచాలని చెప్పారు. కమిషనర్ పర్యటనలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) శకుంతల, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి, ఏడీహెచ్ శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు, పోలీసు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విద్యాధరపురంలో మొక్కలను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వయోవృద్ధులను ఆదరించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యత అని డాక్టర్ ఎస్ఆర్ఎస్ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయి సుధాకర్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత వేముల భానుప్రకాష్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 190 నెలలుగా వయోవృద్ధులకు సేవలు అందిస్తున్న వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ వేముల భానుప్రకాష్, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, సీనియర్ జర్నలిస్ట్ కరణం కళ్యాణ్‌కృష్ణ కుమార్, ట్రస్టీ తట్టి అర్జునరావు, ఉపాధ్యాయురాలు కె.రమాగాయత్రి మాట్లాడారు. అనంతరం సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్, ట్రస్ట్ సభ్యులు ఎన్వీయా సతీష్‌కుమార్, పి.లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గొల్లపూడిలోని ఒక అపార్ట్‌మెంట్‌లో కొత్తపేట అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు నేతృత్వంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుకోకుండా అగ్నిప్రమాదం జరిగితే మంటలు అదుపు చేసే విధానం తదితర అంశాలపై మూడో రోజైన ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే అపార్ట్‌మెంట్ వాసులకు కరపత్రాలను పంపిణీ చేస్తూ అగ్నిప్రమాదాలను నివారించే విధానాలపై ప్రదర్శన నిర్వహించారు. అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగితే ప్రజలను ఏ విధంగా రక్షించాలో అన్న విషయంపై ఫైర్‌మెన్ రెస్క్యూ డ్రిల్ చేశారు. గ్యాస్ స్టవ్‌ను వినియోగించే సమయంలో మహిళలు పాటించాల్సిన నియమాలు, అనుకోకుండా గ్యాస్ లీక్‌గానీ, ట్యూబ్ పాడవటం వలనగానీ, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వలనగానీ అగ్నిప్రమాదాలు జరిగితే నివారించే విధంగా సూచనలు చేశారు. అపార్ట్‌మెంట్స్‌లో ఏర్పాటు చేసిన కార్బన్‌డయాక్సైడ్ ఎగ్జిస్టింగ్‌షెర్స్, ఫైర్ అలారం వంటి అగ్నిమాపక పరికరాలను వినియోగించే విధానాన్ని చెప్పారు.



అగ్ని ప్రమాదాలను నివారించే పద్ధతులను ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం సబ్ స్టేషన్ పరిధిలోని బైపాస్ ఫీడర్ నందు విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రమేష్ తెలిపారు. సూరిబాబు పేట, పోలీస్ స్టేషన్ ఏరియా, ఆల్ఫా సెంటర్, దేవుని చెరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

క్లుప్తంగా

నేడు వీఎంసీలో 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగే స్పందన కార్యక్రమంలో నగర వాసులు తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో, సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగర వాసుల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ముమ్మరంగా మల్లేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునఃనిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనుల్లో భాగంగా ఆదివారం శ్లాబ్ పనులు ప్రారంభమయ్యాయి. శ్లాబ్ పనులకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబలు పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, కేసరి నాగమణి, ఈఈ కోటేశ్వరరావు, ఎల్.రమా, వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జుల శ్రీనివాసశాస్త్రి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 61వ డివిజన్ శాంతినగర్‌లోని నాగరాజు స్వామి ఆలయం పునఃనిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు ఉమ్మడి రమాదేవి, వెంకట్రావ్ దంపతులు పాల్గొని భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. నాయకులు నాలం బాబు, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గుండపు చలపతిరావు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 58వ డివిజన్ నందమూరి నగర్‌లో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. కాలనీ పెద్దలు పాల్గొని పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుండపు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. చలివేంద్రాలు ఏర్పాటుచేయడం వల్ల పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చవచ్చన్నారు. ప్రతి ఏడాది తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిద్దబత్తుని హరికృష్ణకుమార్, ట్రెజరర్ ఉప్పలపాటి శివరామరాజు, గున్న భవాని శంకర్, కళాధర్, మచ్చా రమణ, పింగళి కోటేశ్వరశర్మ పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్య ఉన్నతికి దోహదం

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



గన్నవరం: నైతిక విలువలతో కూడిన విద్య పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక స్రవంతి హైస్కూల్‌లో 2022-23 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొమ్మినేని మాట్లాడుతూ..విద్యార్థులను కేవలం చదువులకే పరిమితం చేయకుండా క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సాహించాలని చెప్పారు. అప్పుడే జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను అధిగమించి లక్ష్య సాధన వైపు ముందుకు వెళ్తారని తెలిపారు. ఈ దిశగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేందుకు మాతృభాషతో పాటు ఆంగ్లంపై కూడా విద్యార్థులు పట్టు సాధించాలని చెప్పారు. తొలుత ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కొమ్మినేని చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ అధ్యక్షతన మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే.ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- రంజాన్ మాసంలో అందరికీ మేలు జరగాలి
- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



మినార్ మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత సలీమ్ ఆధ్వర్యంలో వించిపేటలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతి జరుగుతుందన్నారు. రంజాన్ మాసంలో అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మినార్ మసీదులో..

ఇస్లాం పేట మీనార్ మసీద్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు, నాయకులు మహబూబ్, చాన్, సమీర్, అతీక్, రెహమనా, ఖాన్ పాల్గొన్నారు.

జమీ మసీదులో ఇఫ్తార్ విందు

పటమట(విజయవాడతూర్పు): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా 12వ డివిజన్, ఫారూఖ్ నగర్ జమీ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంలో అవినాష్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో దైవ చింతనతో నెల రోజుల పాటు నియమబద్ధ జీవితం గడపడం వల్ల చక్కని క్రమశిక్షణ, ఓర్పు, సానుభూతి అలవారుతాయన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ముస్లింలకు అనేక పథకాలు అమలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ గౌస్ సలాం, కృష్ణా జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మీర్ హుస్సేన్, 12వ డివిజన్ అధ్యక్షుడు రిజ్వాన్, పార్టీ నాయకులు మెహబూబ్, రామాయణపు శ్రీనివాస్, ఖలీమ్, హసన్ ముస్లింలు, మసీదు కమిటీ పాల్గొన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. గాంధీనగర్‌లోని ఆంధ్రరత్నభవన్‌లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి, ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, కార్యనిర్వాహకులు సుంకర పద్మజ, ఎస్‌కే మస్తాన్, ముస్లింలు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం



వీరేశలింగం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయం, సాంస్కృతిక సంఘం నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బహుముఖ ప్రజ్ఞాశాలి, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు అని గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్బరాజు, పి.వి.సుబ్బరాజు కొనియాడారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా ఆదివారం కందుకూరి జయంతి వేడుకలు నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్త్రీ విద్య, వితంతువు పునర్వివాహాలకు ఆయన చూపిన చొరవ మరువలేనిదన్నారు. నేటి సమాజంలో స్త్రీలు అభివృద్ధి చెందటంలో కందుకూరి వీరేశలింగం పంతులు పాత్ర ఎనలేనిదని కొనియాడారు. గ్రంథాలయం కోశాధికారి డి.సత్యనారాయణరాజు, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, కార్యదర్శి డి.భాస్కరరాజు న్యాయవాది కె.ఎస్.సుధాకరరాజు స్మారక గ్రంథాలయం, సాంస్కృతిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



దేవీనగర్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న నాగసత్యం తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీరాజీవ్‌గాంధీ అవార్డు గ్రహీత, కోఫా సెక్రటరీ రామాయణం నాగసత్యం సూచించారు. స్థానిక 30వ డివిజన్ దేవీనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో ఆదివారం కాపు సేవా సంఘం ఆధ్వర్యాన దాత రామాయణం ఏడుకొండలు సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా వేసవిలో దాహార్తులకు చల్లటి మజ్జిగను అందజేస్తున్న కాపుసేవాసంఘం సేవలను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవీనగర్ కాపు సేవా సంఘం అధ్యక్షుడు గంగిశెట్టి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీర రాఘవ, కోశాధికారి కణజం రవి సంఘం సభ్యులు జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు జీవన వేదనకు అద్దం పట్టిన 'మట్టిబండి గ్రంథం'



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్, వేదికపై సుబ్బారావు, పూర్ణచందు, సాంబశివరావు

విజయవాడకల్చరల్: రైతు జీవన వేదనకు అద్దం పట్టిన దీర్ఘకవిత మట్టిబండి కవితా గ్రంథమని ఏపీ అసెంబ్లీ చీఫ్ విప్ ఓఎస్డీ డాక్టర్ ఎం.ప్రభాకర్ అన్నారు. కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, ఫొటో ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ రచించిన మట్టిబండి దీర్ఘకవిత గ్రంథ పరిచయ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. అంతులేని రైతు జీవన యానంలో అనేక సంఘటనలకు సాక్షిగా మట్టిబండి కవితా సంపుటి నిలిచిందన్నారు. సమాజం స్వరూపం మార్చకలిగిన వాడు రైతు మాత్రమేనని నేటి ఆధునిక సమాజంలో రైతు జీవితం దుర్భరంగా మారిందని ఆది మారాల్సిన అవసముందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు మాట్లాడుతూ.. మినీ కవితలో చెప్పలేని అంశాలను దీర్ఘ కవితలో వివరించవచ్చునని దీర్ఘ కవితా అవసరాన్ని వివరించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా జీవిత విశేషాలను వివరించారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు కవితా సంపుటిలోని విశేషాలను వివరించారు. పరిచయ సభ కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, ఫొటో ఇండియా వ్యవస్థాపకుడు డాక్టర్ తమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వెన్నా వల్లభరావు, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం నిర్వాహకురాలు తేళ్ల అరుణ, డాక్టర్ వి.సింగారావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష ఆదరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుంది. విజయవాడ రూరల్ మండలం పార్టీ అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్ ఆదివారం సాయంత్రం జక్కంపూడి, పైడూరుపాడు సచివాలయాల పరిధిలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఆయన ప్రతి ఇంటికి వెళ్లి 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో కూడా మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జక్కంపూడి సర్పంచ్ వేముల సీతారామయ్య, ఎంపీటీసీ బయ్యారపు కల్పన కిషోర్, మాజీ సర్పంచ్ వెంకటరత్నం, కన్వీనర్ మంద శ్రీనివాసరావు, గృహసారథి కలుపుకోరు గోపయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'చదవటం మాకిష్టం'



గ్రంథాలయానికి క్యారమ్, చెస్ బోర్డులను అందజేస్తున్న మనోజ్‌కుమార్

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో విద్యార్థులచే నీతి కథలు చదివించడం, చెప్పించడంతో పాటు సామూహిక పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాలన్నారు. అప్పుడే చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో మేధాశక్తి, పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళానైపుణ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ వంటి మంచి లక్షణాలు అలవడుతాయని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం గ్రంథాలయంలో జరిగే చదవటం మాకిష్టం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల కోసం క్యారమ్ బోర్డు, చెస్ బోర్డును బహుమానం చేసిన గ్రంథాలయ పాఠకుడు మనోజ్ కుమార్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకుడు వినోద్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కళావేదికపై విజయవాడకు చెందిన అనురాధ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై రిషిత, భావన, రిజాత, జానకీ, భావన, ఆదిత్య, దేవి, కావ్య ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. తెల్లవారుజామున సుప్రభాతసేవ, అనంతరం ప్రత్యేక అర్చనలు చేశారు. సుదర్శన హోమం, ఆదిత్యహృదయ హోమాలను వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, శ్రీచక్రస్నానం వైభవంగా జరిగింది. వేలేరుకు చెందిన వెంకటేశ్వర ఆవిర్నేని తారకబ్రహ్మం, దోనవల్లి పుష్పావతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ట్రస్టీలు కాకాని వెంకటేశ్వరరావు, తవ్వా పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ, ఆభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం స్వామి, గొల్లపల్లి రఘునాథస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్, పుర ప్రముఖులు యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, కనిగంటి రంగారావు, చలసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న నాగుల్‌మీరా, సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ఆజాద్ ముస్లీం కమిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లోని నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ.. రంజాన్ పండుగ మాసంలో నిరుపేదలకు సహాయం చేయడం అంటే ఆ అల్లాహ్‌కు ఎంతో ప్రీతికరమని, తమ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు షేక్ సాజిద్ ఆలీ, ఎండీ కాలేషా, సయ్యద్ మౌలా, అజీజ్, అబ్దుల్ అజ్మతుల్లా పాల్గొన్నారు.

శ్రీశైలంలో సత్రం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



ఎమ్మెల్యే వెలంపల్లిని సత్కరిస్తున్న నగరాల సంఘ నేతలు, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీశైలంలో శ్రీ నగరాల వసతి సత్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సంఘం నేతలను కోరారు. శ్రీశైల క్షేత్ర భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి నగరాలు కులస్తుల నిత్యాన్నదాన వసతి సత్రం కేంద్ర కార్యాలయం కొత్తపేటలో వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఆదివారం సాయంత్రం ప్రారంభించారు.

ఈ సందర్భంగా వెల్లంపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నగరాల సంఘీయుల కోరిక మేరకు శ్రీశైలంలో 50 సెంట్లు స్థలాన్ని సత్రం నిర్మాణ పనులకు కేటాయించామన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరాల కులస్తుల కోరిక మేరకు శ్రీశైలంలో స్థలాన్ని కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి కొరగంజి జగన్ మాట్లాడుతూ తమకు వసతి సత్రం విషయంలో ఎంతో సహకరిస్తున్న వెలంపల్లికి, ముఖ్యమంత్రి జగనన్నకి నగరాల సంఘీయులు రుణపడి ఉంటారన్నారు. అనంతరం జగన్ ఆధ్వర్యంలో కొరగంజి శేఖర్ బాబు మెమోరియల్ ట్రస్ట్, వెలంపల్లి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నల్లాన సూర్యారావు, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, నాయకులు కొరగంజి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యావకాశాలపై అవగాహనకు ఎక్స్‌పో ఉపయోగకరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశ, విదేశాల్లో విశ్వ విద్యాలయాల్లో అందుబాటులో ఉన్న కోర్సులపై ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అడ్మిషన్ యారో సంస్థ ఆధ్వర్యంలో ఎడ్యువర్సిటీ 2023 పేరుతో ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అతి పెద్ద ఎడ్యుకేషన్ ఎక్స్‌పోను ఎమ్మెల్యే మల్లాది విష్ణు లాంఛనంగా ఆదివారం ప్రారంభించారు. ఈ ఎక్స్‌పోలో దేశ విదేశాల్లోని విశ్వ విద్యాలయాల ప్రతినిధులు 150 మంది పాల్గొని 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. కాగా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు, ఖమ్మం జిల్లాల నంచి 1500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి కెరీర్ కౌన్సెలింగ్, ఎంట్రన్స్ అప్లికేషన్స్, అడ్మిషన్ గైడెన్స్, ఇన్‌టెన్సిప్స్, ప్లేస్‌మెంట్స్, ఓవరీస్ ఎడ్యుకేషన్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ వంటి అంశాలతో పాటు ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంబీఏ, పీజీడీఎం, లా, ఆర్కిటెక్చర్, లైబ్రియల్ ఆర్ట్స్ వంటి కోర్సులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడ్మిషన్ యారో అధినేత కేతిబోయిన వెంకట్, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్ కమాండెంట్ కెఎస్ రావు, వెస్టిన్ కాలేజ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల బీమా ప్రీమియాన్ని యాజమాన్యమే భరించాలి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎన్ రెడ్డి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రస్తుతం ఆంధ్యా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు భరిస్తున్న ఆరోగ్య బీమా ప్రీమియం యాజమాన్యమే భరించాలని ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ ఎస్ఎస్ఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రాంతీయ సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ అప్డేషన్‌ను సాధ్యమైనంత త్వరగా సాధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 31 అక్టోబర్ 2017 వరకు బ్యాంకింగ్ రంగంలో విశ్రాంత ఉద్యోగులకు ఏఐబీఆర్ఎఫ్, యూఎఫ్‌బీయూ ద్వారా పెన్షన్ పెంపుదలకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులు యూ.వి.రజనీకాంతరావు, మువ్వల శ్రీధర్, రమేష్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న సంఘ సభ్యులను అభినందించారు. అనంతరం 75 ఏళ్లు దాటిన విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించి 32 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసిన నేత్ర వైద్యులను సన్మానించారు. నాయకులు కృష్ణమూర్తి, జగన్‌మోహన్‌రావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో కిడ్స్ కాన్వకేషన్ సందడి



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక శివాలయం సెంటర్‌లోని నెల్లూరు రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన కిడ్స్ కాన్వకేషన్ కార్యక్రమం ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా యూకేజీ నుంచి ఒకటో తరగతిలోకి వెళుతున్న చిన్నారులకు పట్టాలు అందజేశారు. కాన్వకేషన్ దుస్తుల్లో ఉన్న తమ పిల్లలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా పిల్లలకు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యారంగంలో అనేక సంస్కరణలను తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రవీంద్రభారతి పాఠశాల జనరల్ మేనేజర్ శివారెడ్డి, డీన్ శ్రీకాంత్, ఏజీఎం కేశవరాజు, ప్రిన్సిపాల్ రాధ, ఇన్‌చార్జి రాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

మహాభారత యక్ష-ధర్మజ ప్రశ్నోత్తర పద్యశతకం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మారుతీప్రసన్న, లక్ష్మీనారాయణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): శతక రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణ రచించిన మహాభారత యక్ష-ధర్మజ ప్రశ్నోత్తర పద్యశతకం పుస్తకాన్ని మారుతీ గ్యాస్ కంపెనీ అధినేత చెట్లపల్లి మారుతీప్రసన్న ఆవిష్కరించారు. సత్యనారాయణపురం మారుతీ గ్యాస్ కంపెనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పుస్తక రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తాను రచించిన పుస్తకంను తన భార్య ఉప్పులూరి భారతీదేవికి అంకితం ఇస్తున్నానన్నారు. తాను పుస్తకం రచించేందుకు సహకరించిన శారదా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొన్నలూరి లక్ష్మణరావు, చెట్లపల్లి మారుతీప్రసన్నకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ ఆపిల్ హాస్పిటల్, అనిల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న వైద్యాన్ని సింగ్‌నగర్‌లోని నిరుపేదల కోసం ఉచితంగా అందించడం సంతోషంగా ఉందని, ఇటువంటి శిబిరాలు పేద రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు, కార్యదర్శి పీవీడీ ప్రసాద్, సాయిబాబా, ఎన్‌బీజీఎం ప్రసాద్, షేక్ మస్తాన్, కాశీ ప్రసాద్, అరుణకుమారి, సురేఖ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

రెడ్డిగూడెం: మండలంలో ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఏఈ ఆదివారం తెలిపారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులు 200 యూనిట్లు దాటిన ప్రతిఒక్కరూ బిల్లు కట్టివలసిందని పేర్కొన్నారు. ప్రతినెలా బిల్లులు తప్పనిసరిగా చెల్లించాలని తెలిపారు.


Eid
mubarak
Md.రుహుల్లా
శాసన మండలి సభ్యులు (MLC)
ప్రజలందరికీ
రంజాన్
శుభాకాంక్షలు
నేడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముస్లిం
మైనారిటీ సోదరులకు జగనన్న ఇస్తున్న
ఇఫ్తార్ విందు
ఈ కార్యక్రమమునకు విచ్చేయుచున్న ముస్లిం మైనారిటీల సంక్షేమ సారథి
ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి
స్వాగతం-సుస్వాగతం
షేక్ అమిత్
ఎన్.టి.ఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల
YS జగన్ సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జి
షేక్ మదీన
మైనార్టీ నాయకులు
Md. సలీమ్
మైనార్టీ నాయకులు
షేక్ మెహరాజ్
YSR CP స్టేట్ యూత్ సెక్రటరీ
షేక్ మస్తాన్‌వలి
ప్రొ: హైదరాబాద్ ధమ్ బిర్యాని
షేక్ రహీం
సింగ్‌నగర్ షాదీఖానా
సుభానీఖాన్
YSR CP మైనార్టీ సీనియర్ నాయకులు
Md. హబిబుల్లా
డైరెక్టర్, వక్ఫ్‌బోర్డ్, NTR జిల్లా
Md. అన్వర్
YSR CP మైనార్టీ సీనియర్ నాయకులు
Sk. హనీఫ్‌భాషా (భాషి)
YSR CP NTR జిల్లా అధికార ప్రతినిధి